క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



అమ్మవారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

అంబేడ్కర్‌కు పాలాభిషేకం



అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు రాజయ్య, శేషు, చంద్ర మోహన్, ఎంఎస్ఎఫ్ నాయకులు అనిల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

‘పీఎం సూర్య ఘర్’ను సద్వినియోగం చేసుకోవాలి



కొండపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ సబ్సిడీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం కొండపేటలో సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పైకప్పులో ఉన్న స్థలాన్ని బట్టీ సోలార్‌ప్యానెల్ ఏర్పాటు చేస్తారని వీటి ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గృహ అవసరాలకు ఉపయోగించుకోవడం వల్ల విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. మిగులు విద్యుత్‌ను విద్యుత్‌శాఖ కొనుగోలు చేస్తుందన్నారు.

కర్మాగారంలో పేలుడు

● కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న కుశలప్ప

తాడిపత్రి: అయ్యవారిపల్లి గ్రామం వద్ద ఉన్న ఓ కర్మాగారంలో పేలుడు సంభవించి, ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామంలోని సుగుణ స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కుశలప్ప కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం విధుల్లో పాల్గొన్న ఆయన గ్యాస్ కట్టర్ వద్ద పనిచేస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఓ ఆయిల్ డ్రమ్ము ఒక్కసారిగా బద్ధలైంది. ఘటనలో కుశలప్ప కాలు, చెయ్యి, తలకు డ్రమ్ము రేకులు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మల్లన్నకు పల్లకోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

కరుణామయుడు.. ఏసుక్రీస్తు

● భక్తిశ్రద్ధలతోగుడ్‌ఫ్రైడే
● చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



కోవెలకుంట్లలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మోస్తున్న క్రైస్తవులు



బనగానపల్లెలో శిలువను ఊరేగిస్తున్న క్రైస్తవులు

కోవెలకుంట్ల: సకల మానవుల పాప పరిహారార్థ బలిగా ఏసుక్రీస్తు ప్రాణమిచ్చి కరుణామయుడిగా నిలిచారని ఆయా చర్చీల ఫాదర్లు లూర్దు, ఇసాక్‌రాజ, ప్రేమ్‌సాగర్‌బాబు అన్నారు. శుక్రవారం బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు శుభ శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో రోమన్‌కాథలిక్ మిషన్ చర్చిలో(ఆర్‌సీఎం), చర్చిఆఫ్ సౌత్ ఇండియన్(సీఎస్ఐ) చర్చి, హోసన్నా, నూతన యేరులేం, హరేబు, మండలంలోని గుళ్లదూర్తి, కంపమల్ల, అమడాల, భీమునిపాడు, కలుగొట్ల, తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చీల ఫాదర్లు మాట్లాడుతూ సర్వ జనుల కోసం ఏసుక్రీస్తు శిలువ మరణం పొందిన రోజున గుడ్‌ఫ్రై డేను నిర్వహిస్తున్నారన్నారు. మానవాళిపట్ల ప్రేమ నిస్సహాయులపట్ల కరుణ కలిగి ఉండాలన్నదే ఏసుక్రీస్తు సందేశమన్నారు. చర్చీల పెద్దలు విజయ్, జయరాజు, మైకేల్, సుబ్బరాయుడు, రవి, ఓబులేసు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామకృష్ణాపురం, పలుకూరు, నందివర్గం,టంగుటూరు,తమ్మడపల్లె, చెరువుపల్లె,రామతీర్థం,బీరవోలు తదితర గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపవాస ఆరాధనలు చేశారు. పట్టణంలో ప్రధాన చర్చి మదర్‌థెరిస్సా చర్చిలో ఫాదర్ బాబురాజ్ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక ఆరాధన అనంతరం శిలువను మోసుకుంటూ పెట్రోల్ బంకు సర్కిల్,ఆస్థానం రోడ్డు, పాత బస్టాండ్, చక్రవర్తి ఫంక్షన్ హాల్ మీదుగా రవ్వలకొండ పైకి ఊరేగింపుగా వెళ్లారు. సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ దైవాదీనం ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు.

కొలిమిగుండ్ల: శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనా మందిరాల్లో ఏసుప్రభువును స్మరించుకుంటు ప్రార్థనలు చేశారు. కొలిమిగుండ్ల,బెలుం,కల్వటాల,నందిపాడు,కనకాద్రిపల్లె,అంకిరెడ్డిపల్లె,తుమ్మలపెంట,అబ్దులాపురం,పెద్దవెంతుర్ల తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అవుకు: మండలంలోని క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆర్సీఎం, సీఎస్ఐ తదితర చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రోమన్‌క్యాథలిన్ మిషన్ చర్చిలో ఫాదర్ కరుణాకర్ గుడ్ ఫ్రైడే విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం పురువీధుల్లో శిలువ యాత్ర నిర్వహించారు.



సియోను ప్రార్థనామందిరంలో..



ప్రార్థనలకు హాజరైన మహిళా భక్తులు



సీఎస్ఐ చర్చిలో మాట్లాడుతున్న రెవరెండ్ మేకల రాజేంద్రబాబు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని సియోను, క్రీస్తు సంఘం, సీఎస్ఐ, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, బైబిల్ మిషన్ తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. ఏసు చూపిన బాటలో నడవాలన్నారు.

డోన్/టౌన్: ప్రతిఒక్కరూ సాటి మానవుల పట్ల ప్రేమ, కరుణ, త్యాగం, క్షమించే గుణం చూపించాలని డోన్ సీఎస్ఐ చర్చి ఫాదర్లు రెవరెండ్ మేకల రాజేంద్రబాబు, సామేల్ బాబు సూచించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను ప్రతిఒక్కరూ ఆచరించాలన్నారు.

బేతంచెర్ల: మండల వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించుకున్నారు. బేతంచెర్ల ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలో శిలువను మోసుకుంటూ 14 స్థలాల వద్ద ప్రార్థనలు నిర్వహించి, ఆర్‌సీఎం చర్చి వరకు ఊరేగింపు నిర్వహించారు. సిమెంటునగర్ గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని పాస్టర్లు వినోద్‌కుమార్, చర్చి నిర్వాహకులు డేవిడ్ రాజు, సుధాకర్, స్వాములు, జయాకర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఏబీఎమ్ చర్చిలో పాస్టర్ రెవరెండ్‌ప్రసంగి, చర్చి ప్రెసిడెంట్ జోసఫ్, సెక్రటరీ యాకోబ్, ట్రెజరర్ రమేష్ ఆధ్వర్యంలో, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మప్రే క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో వాక్యోపదేశకులు నారాయణ రెడ్డి, సంఘ పెద్దలు తిమోతి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు.

నవంబర్‌లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు

డోన్: తెలుగు భాష సంస్కృతితో పాటు కళలు తెలుగు ప్రజల మధ్య శాశ్వతంగా ఉండేందుకు స్వచ్ఛంధ సేవా సంస్థలు ఎనలేని కృషి చేస్తున్నాయని తెలుగు కవి డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో మాట్లాడుతూ ఏలూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ ఏడాది నవంబర్ 10న పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలూరులోని మహాలక్ష్మి, గోపాలస్వామి కల్యాణ మండపంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు తెలుగు భాషాభిమానులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26వ విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో లేని విద్యార్థులు రెండు పాస్ ఫొటోలు తమ వెంట తీసుకురావాలని సూచించారు.

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఆపైన పాస్ అయిన వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. 35 రోజుల కోర్సులో కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లీషు, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబరును సంప్రదించాలన్నారు.

వైభవంగా తిరుచ్చి మహోత్సవం



తిరుచ్చి మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు కళ్యాణచక్రవర్తి.. మద్దిలేటి నరసింహస్వామిని పుష్పాలతో అలంకరించి పల్లకీలో కొలువుంచి, కాగడాల వెలుతురులో ఆలయ మాడ వీధుల్లో గోవిందనామ స్మరణలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రామ్‌మోహన్‌రావు, అర్చకులు మనోహర్, నరసింహ పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు అర్చకులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర ఉత్సవమూర్తులను అలంకరించారు. అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి, సిబ్బంది, భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం కల్యాణం కమనీయంగా సాగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, అర్చకులు ధర్మతేజ, పండితులు స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాంగళ్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు చేశారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శేషారెడ్డి హైస్కూల్ మైదానంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ రమేష్ బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బుగ్గన ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. 16 జట్లు పాల్గొన్నాయి.

పరిశ్రమలు నిబంధనలు పాటించాలి



బాధితులను రక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్ నాయక్

బనగానపల్లె రూరల్ : ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యాలు అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించాలని బనగానపల్లె అగ్నిమాపక శాఖ అధికారి ఈశ్వర్‌నాయక్ అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యనకండ్ల గ్రామంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు బాధితులను ఎలా రక్షించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. పరిశ్రమ వైస్ ప్రసిడెంట్‌గురివిరెడ్డి, సీనియర్ మేనేజర్ శివప్రసాద్,డీజీఎం రమణారెడ్డి ఉన్నారు.

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ వేదపండితులు

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేట చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం శుక్రవారం పూర్ణాహుతితో ముగిశాయి. చివరి రోజు ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్లు ఈవీ సుజాత శర్మ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, హుసేన్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోకంగా పూర్ణాహుతి నిర్వహించారు. వసంతోత్సవంతో పాటు, పారువేట కార్యక్రమంతో చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీరామ నామ అఖండ సప్తాహం కూడా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి, పద్మావతమ్మ దంపతుల ఆధ్వర్యంలో భజన సంఘాల సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, బాల నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగమోహన్ పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం



వైఎస్సార్‌సీపీ నాయకుడు కోట్ల హర్షవర్దన్ రెడ్డి, మంజుల దంపతుల కుమార్తె శ్రేయ, వివేకానంద విరూపాక్షలకు ఇటీవల వివాహం జరిగింది. శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కర్నూలులోని కోట్ల హర్ష ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు.
– బేతంచెర్ల

ప్రాథమిక తరగతుల విలీనాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): 1, 2 తరగతులను కూడా హైస్కూళ్లలో విలీనం చేయడం సబబు కాదని ఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక తరగతులను హైస్కూళ్లలో విలీనం చేస్తే ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులను కేటాయించే సందర్భంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని చూడకూడదన్నారు.సమావేశంలో ఎస్‌టీటీఎఫ్ నాయకులు రాము, రవీంద్రబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ చోరీ

వెల్దుర్తి: మండలంలోని యాదరాళ్ల గ్రామంలో రహదారిని ఆనుకుని నిర్మితమవుతున్న అంగన్‌వాడీ భవనంపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ చోరీకి గురైంది. కార్యాలయ నిర్మాణంలో భాగంగా 300 లీటర్ల నీళ్ల ట్యాంకు, పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే నిర్మాణ పనులు నెమ్మెదిగా సాగుతున్నాయి. ఈ పరిస్థితులలో భవనంపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ లేకపోవడాన్ని గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. గుర్తుతెలియని దుండగులు చోరీ చేసి ఉంటారని చెబుతున్నారు. అయితే భవనం నిర్మాణ దశ నుంచే మందుబాబులకు అడ్డాగా మారిపోయింది.

21న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



పోటీల ప్రారంభ కార్యక్రమానికి డీఎస్పీని ఆహ్వానిస్తున్న సీఎస్ఐ సంఘం పెద్దలు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో ఈస్టర్‌ను పురస్కరించుకుని ఈనెల 21న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్ఐ ప్రార్థనా మందిరం సంఘం పెద్దలు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రావాల్సిందిగా డీఎస్పీ రామాంజినాయక్‌ను, సీఐ రామును కలిసి శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూ కేటగిరీ వృషభాలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు, ఏడో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి రశీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 6281655869 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బైకును ఢీకొన్న కారు

● ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

డోన్ టౌన్: జాతీయ రహదారి దొరపల్లె క్రాస్ వద్ద శుక్రవారం బైకును కారు ఢీకొనడంతో డోన్‌కు చెందిన రవి, జలదుర్గానికి చెందిన ప్రేమ్‌కుమార్‌లు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు కారు వెళ్తుండగా బాధితులు బైకుపై యు.కొత్తపల్లె దాబా వద్ద టీ తాగి పట్టణంలోకి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ బంక్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి



మంటలను అదుపు చేసే విధానం నేర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పెట్రోల్ బంక్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలని డోన్ అగ్నిమాపక కేంద్రం అధికారి రంగస్వామి గౌడ్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కార్తికేయ ఫిల్లింగ్ స్టేషన్‌లో సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి పెట్రోల్ బంక్‌లో విధిగా అగ్ని నిరోధక సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పెట్రోల్ పోసే టప్పుడు సెల్ ఫోన్ మాట్లాడరాదన్నారు. బీడీ, సిగరెట్ వెలిగించరాదన్నారు. మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పాలో సిబ్బంది చేత చేయించి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రభాకర్, రాజశేఖర్, నాగేంద్ర బాబు, హరి ప్రసాద్, రంగస్వామి ఉన్నారు.

గాలివానకు దెబ్బతిన్న అరటితోటలు



దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అసిస్టెంట్

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున ప్రాంతంలో వీచిన గాలీవానకు 50 ఎకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నాయి. గుడిపాడు, పీఆర్ పల్లె, చంద్రపల్లె, నల్లమేకలపల్లి తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. దీంతో దాదాపు 25 మంది రైతులకు చెందిన అరటితోటలు 50 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి తెలిపారు. ఐదు ఎకరాల్లో సాగు చేసిన అరటితోట పూర్తిగా దెబ్బతిని రూ.10 లక్షలు నష్టపోయానని నల్లమేకలపల్లి గ్రామానికి చెందిన రైతు రాజగోపాలనాయుడు తెలిపారు. పీఆర్‌పల్లె గ్రామంలో శ్రీనివాసులుకు చెందిన షేడ్‌నెట్ హౌస్ గాలీవానకు కూలిపోయింది. షేడ్‌నెట్ హౌస్ కూలడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. దెబ్బతిన్న పంటలను గుడిపాడు ఆర్ఎస్‌కే హార్టికల్చర్ అసిస్టెంట్ షానవాజ్ పరిశీలించారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్



పట్టుపడిన నాటు సారాను చూపుతున్న సీఐ వరలక్ష్మి, సిబ్బంది

డోన్ రూరల్: నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. ప్యాపిలి, రాచర్ల, జలదుర్గం పోలీసులతో కలిసి పలు గ్రామాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఆలేబాద్‌తండాకు చెందిన ముదావత్ హేమనాయక్, ముదావత్ లక్ష్మీనాయక్ నాటు సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి 65 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. సమావేశంలో సీఐ జయరాంనాయుడు, రాచర్ల, ప్యాపిలి, జలదుర్గం ఎస్ఐలు రమేష్‌బాబు, మధుసూదన్, నాగార్జున, ఎక్సైజ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దొలావత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.